క్లుప్తంగా

అక్రమ కేసులకు భయపడేది లేదు


చిప్పాడ వెంకన్న

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వైఎస్సార్ సీపీ నాయకులు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని వైఎస్సార్‌సీపీ మీడియా కోఆర్డినేటర్ చిప్పాడ వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడుసార్లు ఎంపీగా గెలిచిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై రెడ్‌బుక్ రాజ్యాంగంతో అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేశారని, ఆయన త్వరలోనే బయటకు వస్తారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సన్నిహితంగా ఉన్న వారిపై కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు వైఎస్సార్ సీపీ నేతలు భయపడేది లేదన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 విరాళం


సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

కొయ్యలగూడెం: శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 విరాళం అందినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ ఆదివారం పేర్కొన్నారు. గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి రెస్టారెంట్ యజమాని మండలపు వెంకట సుబ్రహ్మణ్యం (పెదబాబు), నాగశేషు, నల్లపాటి లక్ష్మీకాంతం తమ తల్లి సంజీవమ్మ జ్ఞాపకార్థంగా ఈ విరాళంగా అందజేశారు. పోతవరం రోడ్డులో స్వయంభూగా వెలసిన పుట్టకి పడమటి వైపు నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టినట్లు ట్రెజరర్ ఐలూరి విశ్వనాథ శర్మ పేర్కొన్నారు. రూ.35 లక్షల అంచనాతో ఆలయ నిర్మాణం సంకల్పించామని అన్నారు. సింహపురి రెస్టారెంట్ యజమాని మన్నే వెంకటరత్నం చౌదరి సుమారు రూ.40 లక్షల విలువైన మూడున్నర సెంట్లు స్థలాన్ని ఆలయ నిర్మాణానికి విరాళంగా అందజేశారన్నారు. మేకల అన్నవరం, చోడిపిండి సుబ్రహ్మణ్యం, యాతం సత్యనారాయణ పాల్గొన్నారు.

వైరల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: వైరల్ జ్వరాల పట్ల వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పటిష్ట చర్యలు తీసుకోవాలని ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అన్నారు. ఆదివారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, వైరల్ జ్వరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేసేందుకు విస్తృతంగా అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంపూర్ణ ఆరోగ్యం పరిరక్షణ మండలంగా ఏలూరు రూరల్ మండలాన్ని తీర్చిదిద్దేందుకు ప్రజలందరితోపాటు వైద్యులు వైద్య సిబ్బంది స్వచ్ఛంద సంస్థలు పూర్తి సహాయ సహకారాలు తోడ్పాటు అందించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటా వైరల్ ఫీవర్లు అసంక్రమిత వ్యాధుల సర్వే మరింత పకడ్బందీగా చేయాలన్నారు. తరచూ క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వేలను వైద్యాధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

రైల్వే గేటు మీదుగా రాకపోకల పునరుద్ధరణ

భీమడోలు: రైల్వే ట్రాక్ మరమ్మతులు ముగిసినందున ఆదివారం సాయంత్రం నుంచి రైల్వే గేటు తెరుచుకుంది. దీంతో వాహన రాకపోకలు ఆరు రోజుల తరువాత పునః ప్రారంభమయ్యాయి. వాస్తవానికి ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రైల్వే గేటు మూసేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. అనివార్య కారణాలతో 22వ తేదీ నుంచి ట్రాక్ అత్యవసర మరమ్మతులను చేపట్టారు. దీంతో జిల్లాలోని పలు డిపోల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా భీమడోలు చేరుకున్నాయి. ప్రముఖ ద్వారకాతిరుమల దేవస్థానానికి వెళ్లే భక్తులు, ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. అదే విధంగా వ్యవసాయ పనుల నేపథ్యంలో రైతులతోపాటు వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు తాడేపల్లిగూడెం, ఏలూరు వైపుగా వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడ్డారు.

బలవంతపు రిజిస్ట్రేషన్లు ఆపాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పీ-4 మార్గదర్శకులుగా ఉపాధ్యాయుల బలవంతపు రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజల ఆర్థిక అసమానతలు తొలగించడం కోసం పీ-4 అనే కొత్త అంశాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ పథకంలో స్వచ్ఛందంగా రిజిస్టర్ అవ్వొచ్చని చెప్పారని, రాష్ట్రంలోని కొంతమంది కలెక్టర్లు, డీఈఓలు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా రిజిస్టర్ కావాలని మెసేజ్‌లు, సర్క్యులర్ల రూపంలో ఒత్తిడి చేస్తున్నారని గోపీమూర్తి విమర్శించారు. బలవతంగా ఉపాధ్యాయులను రిజిస్టర్ చేయించడం సరికాదని వెంటనే అలాంటివి నిలుపుదల చేయాలని కోరారు. బలవంతపు రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేకపోతే ఉపాధ్యాయ సంఘాలతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఊపందుకున్న ఖరీఫ్ పనులు


బుట్టాయగూడెం శివారులో పొలంలో దుక్కిదున్నుతున్న దృశ్యం


బుట్టాయగూడెంలో మహిళలు వరినాట్లు వేస్తున్న దృశ్యం

- మన్యంలో విస్తృతంగా వరి సాగు
- రైతులకు సూచనలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తూ ఉండడంతో రైతులు, కూలీలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో పొలాల్లో దుక్కులు దున్ని రైతులు చదును చేస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో వరినాట్లు వేస్తున్నారు. వరి నారుమడుల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, విత్తనాల ఎంపిక, భూమిని చదును చేయడం, నేల స్వభావం, నీటి లభ్యత, విత్తన శుద్ధి, ఎరువుల మోతాదు, తదితర అంశాలపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కలిగిస్తున్నారు.

జోరుగా వరినాట్లు

పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కొయ్యలగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ప్రస్తుతం వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో సుమారు 32,633 హెక్టార్లలో పంటలు సాగు చేసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ఈ ఏడాది వరి పంటతో పాటు ప్రత్తి, జొన్న, మినుములు, వేరుశనగ, తదితర పంటలు వేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం పంటల సాగుకు వాతావరణం అనుకూలించడంతో రైతులు సాగు పనులను ముమ్మరం చేశారు. ఇప్పటివరకు 20 శాతం వరి నాట్లు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

విత్తే సమయం కీలకం

మధ్యస్థం, స్వల్పకాలిక విత్తన రకాలను ప్రస్తుతం సీజన్ నుంచి జూలై నెలాఖరు వరకూ వరినాట్లు వేసుకోవచ్చు. ఆగస్టు నెలాఖరు వరకూ ప్రధాన పొలాల్లో నాట్లు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ సమయంలో నాట్లు వేయడం ద్వారా పంట దిగుబడి బాగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక రకాలు సాగు చేయడం వలన చీడ, పీడల ఉధృతి పెడగడమే కాక నీటి వృథా కూడా ఎక్కువవుతుందని అంటున్నారు.

నారుమడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నారుమడిలో 2 క్వింటాళ్ల పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్ట్ వేసి రెండు మూడుసార్లు బాగా దమ్ము చేసి చదును చేయాలి.
- ఐదు సెంట్ల నారుమడిలో ఒక కిలో నత్రజని, 2 కిలోల భాస్వరం, ఒక కిలో పొటాషియం వంటి ఎరువులను దుక్కిలో వేసుకోవాలి. విత్తనాలు వేసుకున్న 15 రోజుల తర్వాత కిలో నత్రజనిని వేసుకోవాలి. నాట్లు ఆలస్యమైతే రెండో దఫా నత్రజని వేసుకోవచ్చు.
- విత్తనం చల్లిన తర్వాత మొక్కదశలో పల్చగా నీరు ఉండాలి. సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ ద్వారా నారును పెంచుకుంటే ప్రధాన పంట పొలంలో వచ్చే సమస్యలను అధిగమించవచ్చు.

రైతులకు అవగాహన అవసరం



ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో పంటలసాగుపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలి. ఖరీఫ్‌లో విత్తనం ఎంపిక, విత్తన శుద్ధి, నారుమడుల తయారీ, నాట్లు వేసే సమయంలోనే మెలకువలను పాటించాలి. అలాగే వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఎరువులను వినియోగిస్తే ఆశించిన పంటల దిగుబడి సాధించవచ్చు.

– కె. గంగాధరం, మండల వ్యవసాయధికారి, జీలుగుమిల్లి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: నిమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో కట్టపాదులగూడెం టెక్కినవారిగూడెం గ్రామాలకి, పట్టెన్నపాలెం లైన్ మీద మర్లగూడెం గ్రామానికి 24 గంటల 3 ఫేజ్ లైన్ వేయు నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పీర్‌అహ్మద్‌ఖాన్ తెలిపారు. కట్టవపాదలగూడెం, మర్లగూడెం గ్రామాల్లోని గృహ, వ్యవసాయ, కమర్షియల్ అన్ని రకాల సర్వీసులకు విద్యుతు సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్‌సీఎం చర్చి నిర్మాణానికి రూ.లక్ష విరాళం


చర్చి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న వాసిరెడ్డి మధు

టి.నరసాపురం: మండలంలోని బంధంచర్ల గ్రామంలో ఆర్‌సీఎం చర్చి నిర్మాణానికి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు, కె జగ్గవరం సొసైటీ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి మధు, కుటుంబ సభ్యులు రూ.లక్ష చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, చర్చి సంఘస్తులు దాతలు వాసిరెడ్డి మధు కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

డీఎస్పీ కార్యాలయంలో నేడు పీజీఆర్ఎస్

జంగారెడ్డిగూడెం: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ యు.రవిచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నామన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఏలూరుకు చెందిన భక్తులు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఏలూరుకు చెందిన చిత్త శ్రీనివాసరావు, చాముండేశ్వరి కుటుంబం అమ్మవారి దర్శనానికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా వేదపండితులు ఆశీర్వచనం అందించారు.

శ్రీవారి గానామృత కల్యాణోత్సవం


మదన గోపాలస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్థానిక మదన గోపాల స్వామి ఆలయంలో శ్రీవేంకటేశ్వర స్వామి గానామృత కల్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పసుపు కొట్టుట, కుబేర సేవ, వరపూజ, ఎదుర్కోలు సేవ, శిలా రూప, కళ్యాణ, పుష్పయాగం తిరుప్పావడా పవళింపు తదితర సేవలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కొల్లూరు శ్రీనివాస్ పావని దంపతులచే అర్చకులు గుడిపూడి శేషాచార్యులు కళ్యాణోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అప్పల దివ్యశ్రీ, అప్పల రత్నమ్మచే రచించిన గానామృత కల్యాణోత్సవం భక్తులను విశేషంగా ఆకర్షించింది. స్వామి వారి ఆధ్యాత్మిక గేయాలను పాడుతూ కల్యాణ క్రతువు నిర్వహించడం ప్రజలను ఆకట్టుకుంది. సుమారు నాలుగు గంటల పాటు నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీలకు న్యాయం జరిగింది జగన్ పాలనలోనే

రాష్ట్ర మాజీ హోం మంత్రి వనిత


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ హోం మంత్రి వనిత

ద్వారకాతిరుమల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ఎస్సీ సామాజిక వర్గానికి అన్నివిధాలా న్యాయం జరిగిందని రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. రాజమండ్రిలోని సంహిత కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా వనిత, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు, రాష్ట్ర మాజీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు, పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు, రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజానగరం, గోపాలపురం, అనపర్తి మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ద్వారకాతిరుమల మండలం నుంచి పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు ఆధ్వర్యంలో సుమారు 70 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వనిత మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలిచ్చి చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను ప్రజలకు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కొడుదుల ప్రసాద్, మానుకొండ కన్నయ్య, బిరుదుగడ్డ బజారియ్య, గుమ్మడి శ్రీను, దాసరి ఏసురత్నం, మాదవ్, దాసరి కృష్ణంరాజు, దేవదాసు, సురేష్, దాసరి రాజ్‌కుమార్, మానుకొండ పద్మారావు, ఎస్సీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఉద్యమించాలి


సంతకాల సేకరణ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

జంగారెడ్డిగూడెం: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం పంగిడిగూడెం గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోలిమే బాలయేసు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేయడం కోసం ఆదాని స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చారన్నారు. ప్రజలందరూ వాటిని తిరస్కరించాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ, జనసేన పార్టీలు ఈ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం మాట మార్చిందన్నారు. ఆగస్టు 5వ తేదీన మండలంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ ల వద్ద పెద్ద ఎత్తున చేపడుతున్న ధర్నా కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ మండల నాయకులు కుంచే నాగేంద్రబాబు, గూదే ఆశీర్వాదం, నెట్టా రామారావు, సీహెచ్ గంగాధర్ రావు, గోలిమే బేబి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం జరిగింది. స్థానిక లయన్స్‌క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ లయన్ ఎస్‌వీవీఎస్ పాపారావు పాల్గొని సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా దాసరి శేషుకుమార్, కార్యదర్శిగా రవిచంద్రరెడ్డి, కోశాధికారి కాకర్ల వీరభద్రరావు, కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో తలసేమియా పిల్లల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. సీహెచ్ సత్యనారాయణ వృద్ధ దంపతులకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. తలసేమియా పిల్లలు 15 మందికి న్యూట్రిషన్ ఫుడ్ అందజేశారు. సీతా మహాలక్ష్మి వృద్ధాశ్రమంలో దుస్తులు, దుప్పట్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. అలాగే లే అవుట్ కాలనీలో నివాసం ఉంటూ జంగారెడ్డిగూడెం హైస్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థికి రూ.8 వేలు విలువ చేసే సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో మురళీమోహన్‌రావు, వి.సత్యస్వరూప్, రత్నకుమారి, కన్నం హనుమంతరావు, యర్రం రాజు, విజయరామరాజు, కొనగళ్ల రాంబ్రహ్మం, మద్దిపాటి నాగేశ్వరరావు, కొండపల్లి పండు, పి.వెంకన్న, జగత్‌కుమార్, కె.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయరాజు పుట్టినరోజు వేడుకలు


చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ విజయరాజు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు


విజయరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు డీఎన్‌ఆర్, ఏలూరు సమన్వయకర్త జేపీ, పార్టీ నేతలు

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు పుట్టినరోజు వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. రామన్నపాలెంలో పార్టీ మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా కంభం విజయరాజు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో పాలన చేపట్టిన కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చే విధంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను వివరించాలని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన మళ్లీ రావాలంటే ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరపల్లి రామ్మోహన్ రావు, నానాది సాగర్, గుర్రాల రవికుమార్, దాసి పండు, డాక్టర్ తమ్మిశెట్టి గిరిజ సుబ్రహ్మణ్యం, మెరుగు బాబురావు, మేడంకి చిన్న, పోలిమట్ల ప్రశాంత్, చింతనబోయిన సుబ్రహ్మణ్యం, దేవరాజు, సిద్ధిరాజు, కొమ్మి నరేష్, నల్లూరు ప్రభాకర్, గుమ్మడి శ్రీనివాస్, ఎస్‌కే కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే కాలంలో ప్రజలతో మమేకం అవుతూ చింతలపూడిలో పార్టీ జెండా ఎగురవేయాలనీ, పార్టీని బలోపేతం చేస్తూ నేతలు, కార్యకర్తలకు అండగా ఉండాలని ఆకాంక్షించారు. ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్, ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, నగర బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు తదితరులు విజయరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

కలాంకు ఘన నివాళి


కొయ్యలగూడెం లైబ్రరీలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం


కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు

కొయ్యలగూడెం: భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం పదవ వర్ధంతి కార్యక్రమం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. లైబ్రేరియన్ యు.రాముడుతో కలిసి చిన్నారులు కలాం చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ భారతదేశ ప్రతిభను ప్రపంచానికి తెలియచెప్పి మిస్సైల్ మాన్‌గా కలాం బిరుదు పొందారని, ఆయన చేసిన సేవలకు, దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నతో కేంద్ర ప్రభుత్వం గౌరవించిందని అన్నారు. కలాం నేతృత్వంలో శాస్త్రవేత్తలు నిర్వహించిన అణు బాంబు పరీక్షల ప్రదర్శనతో భారత్ శత్రుదేశాలకు ధీటైన జవాబు ఇచ్చిందని అన్నారు.

కలాం వర్ధంతి

జంగారెడ్డిగూడెం: ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు యుగంధర్ ఆధ్వర్యంలో కలాం విగ్రహాలకు పూలమమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యర్రా అప్పారావు, మరికొందరు సభ్యులు తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేశారు. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రామిశెట్టి శ్రీనివాసరావు, బేతా రమేష్, మండవల్లి రాంబాబు, గొల్లపూడి రమేష్, జల్లిపల్లి శివకృష్ణ, వీరవల్లి శ్రీనివాసరావు, నీలం మధు, సూర్య తేజ తదితరులు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. కనకదుర్గమ్మ


వర్షాల కోసం రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ తల్లికి పూజలు చేస్తున్న దృశ్యం


విశేషాలంకరణలో అమ్మవారు

బుట్టాయగూడెం: వర్షాలు విస్తారంగా కురిసి చెరువులు జలకళ సంతరించుకోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ఆదివారం బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ తల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున నీళ్ల బిందెలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరణ చేసి పసుపు కుంకుమలతో పూజలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు అల్లూరి రత్నాజీరావు, భౌమరాజు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల ఆశించిన వర్షాలు కురవకపోవడం ఇటు ప్రజల్లో, అటు రైతుల్లో తీవ్రమైన ఆందోళన నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో కనకదుర్గమ్మ అమ్మవారికి జలాభిషేకం చేయడం వల్ల విస్తారంగా వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో పూజా కార్యక్రమాలు జరిపించినట్లు తెలిపారు.

టీచర్లకు పీ-4 దత్తత బాధ్యత

దెందులూరు: ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం పీ-4 విధానాన్ని తప్పనిసరి చేసింది. తమ స్కూళ్లలో కింది స్థాయి సిబ్బందితోపాటు విద్యార్థుల కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. డీఈఓ లిఖిత పూర్వక ఆదేశాలను ఎంఈఓలకు పంపారు. ఈ మేరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింకును డీఈఓల ద్వారా ఎంఈఓలు ఉపాధ్యాయులకు పంపారు. ఇప్పటికీ బోధన పక్కనబెట్టి ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవలో తరిస్తున్న తమకు ఇదేం తలనొప్పి అంటూ ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. దీనిని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వంలోని అన్ని మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులకు పీ-4 అమలు చేస్తున్నామని హెచ్ఎంలు, టీచర్లు విధిగా పాటించాలని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో వంట చేస్తున్న ఏజెన్సీలోని సహాయకులు, ఆయాలు, నైట్ వాచ్‌మెన్లు, తోటమాలితో పాటు దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న కుటుంబాల వారిని దత్తత తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు కనీసం ఐదు కుటుంబాలను, ఉపాధ్యాయులు రెండు కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకొని రిజిస్టర్ చేసుకోవాలని ఆదేశించారు.